క్లుప్తంగా

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



కొక్కిలిగడ్డ(మోపిదేవి): వరద గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండలంలోని కోసూరువారిపాలెంలో సర్పంచి కోసూరు అనూష ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. కొక్కిలిగడ్డలో సర్పంచ్ దిడ్ల జానకీరాంబాబు ఆధ్వర్యంలో రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్, సున్నం చల్లించి పల్లం ప్రాంతాల్లో మురుగునీరు తొలగించారు. కె.కొత్తపాలెంలో గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి ఆధ్వర్యంలో అంటువ్యాధులు ప్రబలకుండా ఇళ్లచుట్టూ ఉన్న ముళ్లకంప తొలగించే పనులు చేపట్టారు.

ఘనంగా మరియమాత పుట్టిన రోజు వేడుకలు



పెడన: పట్టణం, మండలంలోని పలు ఏసు క్రీస్తు దేవాలయాల్లో, ప్రార్థన మందిరాల్లో ఆదివారం మరియమాత పుట్టిన రోజు వేడుకలను, దివ్యబలిపూజలను నిర్వహించారు. కొంకేపూడి చర్చిలో ఫాదర్ జోజిరెడ్డి కేక్ కట్ చేసి మరియ మాత పుట్టిన రోజు వేడుకలను నిర్వహించారు. నందిగామ దేవాలయంలో ఫాదర్ జీవన్ కిషోర్, ముచ్చర్లలో ఫాదర్ యాకోబు, పెడన ఆర్సీఎం చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. క్రీస్తుసువార్తీకులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ముసురుతో ఇబ్బందులు



మచిలీపట్నంటౌన్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం కారణంగా జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలో ఆదివారం ముసురు పట్టింది.ఇటీవల ప్రతిరోజూ వర్షాలు కురు స్తుండడంతో నగర ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ వర్షాలతో నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక చవితి నవరాత్రి మహోత్సవాల పందిళ్ల వద్ద గణనాథుని విగ్రహాలు తడిసి ఇబ్బందులకు గురయ్యారు. పందిళ్లను వ్యయ ప్రయాసలకోర్చి అందంగా తీర్చిదిద్దారు. అయితే వర్షం కారణంగా ఇబ్బందులు తప్పలేదు.

450 మందికి వైద్య సేవలు



మచిలీపట్నంటౌన్: స్థానిక వాసవీ, అనుబంధ క్లబ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం బృందావనపుర కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.దాదాపు 450 మంది రోగులకు వైద్య సేవలు అందించారు. దివ్య ల్యాబ్ (అపోలో) ఆధ్వర్యంలో ఉచితంగా సుగర్, కొలెస్ట్రాల్ టెస్టులు చేశారు. ఎముకుల వైద్యుడు యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం ఎముకుల సాంద్రత పరీక్షలు చేశారు. విజయవాడ క్యాపిటల్ హాస్పిటల్‌కు చెందిన హార్ట్ స్పెషలిస్ట్ ఎం .ప్రియాంక, ఊపిరితిత్తులు, ఛాతి స్పెషలిస్ట్ సాగర్, ఈ ఎన్‌టీ స్పెషలిస్ట్ సత్యనారాయణ రోగులకు వైద్య సేవలు అందించారు. ఈ వైద్య శిబిరాన్ని క్లబ్ ప్రతినిధులు ఎండురి సురేష్, శ్రీకాకుళపు రేణుక రాణి, వేముల శిరీష, రంగ నాయకులు, అన్నం అశోక్ పర్యవేక్షించారు.

వ్యక్తికి గాయాలు




పెదప్రోలు(మోపిదేవి): మండల పరిధిలోని పెదప్రోలులో సైకిల్‌పై వెళుతున్న యడ్ల వెంకటేశ్వరరావును వెనుక నుంచి వచ్చిన లారీ ఢీ కొనడంలో రోడ్డు పక్కన పడిపోయాడు. స్థానికులుఇచ్చిన సమాచారంతో108 సిబ్బంది వెంకటేశ్వరరావును అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

మృత్యువాత పడుతున్న జీవాలు

అవనిగడ్డ: ఇటీవల వచ్చిన వరద అనంతరం మూగజీవాలు చనిపోవడంతో పశు పోషకులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలోని ఎడ్లంకలో శనివారం సాయంత్రం వరకూ ఆరోగ్యంగా ఉన్న ఒక మేక ఉన్నట్టుండి చనిపోయింది. దీంతో వరదల వల్ల ఏదైనా వైరస్ ఆశించి మేక చనిపోయిందా మరేదైనా కారణమో తెలియడం లేదని, పశువైద్యులు తమ గ్రామంలో పర్యటించి పరిశీలన చేయాలని స్థానికులు కోరుతున్నారు.


ఊరూవాడా
వినాయక చవితి వేడుకలు



కోడూరులో శ్రీరాముడు, హనుమాన్ సమేత లంబోదరుడి విగ్రహం



నాగాయలంకలో ప్రసన్నగణపతి 67వ వార్షిక ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో డీఎస్పీ, సీఐ




బంటుమిల్లి జానకీరామపురం గ్రామంలో బొజ్జగణపయ్యకు పూజలు



మచిలీపట్నంటౌన్ బుట్టాయిపేటలోని మల్లిఖార్జునస్వామి ఆలయంలో గణనాథుడు..



బంటుమిల్లి పాత బస్టాండ్ సెంటర్లో పూజలు అందుకున్న గణనాథుడు



కోడూరులో గణనాథుడిని రథంపై పరమేశ్వరుడు, నందిశ్వరుడి తీసుకువెళ్తున్నట్లు ఉన్న విగ్రహం



కృత్తివెన్ను మండలం గాంధీనగరంలో పూజలందుకుంటున్న గణనాథుడు

భక్తకోటికి ఇష్టదైవమైన గణనాథుడికి ఊరూవాడా ప్రత్యేక పూజలు చేసి చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో శనివారం నిర్వహించారు. ప్రత్యేక పందిళ్లలో బొజ్జగణపయ్య విగ్రహాలను నెలకొల్పి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. వినాయకుడి మట్టి ప్రతిమలకు పూజలు చేసేందుకు భక్తులు ఉత్సాహం చూపారు. వివిధ రకాల పూలు, పండ్లతో మండపాలను అలంకరించి, కుడుములు, ఉండ్రాళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు.

-మచిలీపటనంటౌన్/కోడూరు/నాగాయలంక/బంటుమిల్లి /మోపిదేవి/గూడూరు/ ఘంటసాల



మోపిదేవిలో గణనాథుని సన్నిధిలో ఆలయ అధికారులు, పండితులు



నాగాయలంకలో చిన్నారులకు పుస్తకాలు అందిస్తున్న డీఎస్పీ, సీఐ, ఆర్యవైశ్య నేతలు



గూడూరు రాయవరంలో పూజలు చేస్తున్న కోళ్ల బాలకృష్ణ, నాంచారయ్య దంపతులు



కోడూరులో శ్రీసిద్ధి బుద్ధి సమేత ప్రసన్న గణపతి



నాగాయలంకలో పూజలో దిలీప్, అనూష దంపతులు



నాగాయలంకలో హోమం చేస్తున్న ఆకురాతి దంపతులు



పెడన బ్రహ్మపురంలో నిమజ్జనోత్సవం



పెడన ఆర్టీసీ బస్టాండు సమీపంలో..



ఘంటసాల గోటకం గాయత్రీదేవీ రోడ్డులో..

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

కోడూరు: భారీ వర్షం, వరద కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకొని, నష్ట పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు డిమాండ్ చేశారు. శనివారం ఆ పార్టీ నేతలు మండలంలో ముంపునకు గురైన వరిపొలాలను పరిశీలించారు. దివిసీమలోని కోడూరు, నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి, చల్లపల్లి మండలాల్లో భారీ వర్షానికి పొలాలు మునకబారిన పడ్డాయని నరసింహారావు తెలిపారు. ప్రభుత్వం అన్ని అంశాలను పరిగణలోకి తీసుకొని క్షేత్రస్థాయిలో పంటనష్టాన్ని అంచనా వేయాలని నరసింహారావు కోరారు. ప్రతి రైతులకు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కోడూరు, విశ్వనాథపల్లి, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో మునకబారిన పొలాలు, కుళ్లిపోయిన వరిదుబ్బులను పరిశీలించారు. పార్టీ నేతలు యద్దనపూడి మధు, బండి ఆదిశేషు, పోలాబత్తిన మోహనరావు, మహ్మద్ కరీముల్లా, బెజవాడ నాగేశ్వరరావు, గొరిశెట్టి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



కోడూరులో ముంపు పొలాలను పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

బాధితులకు దాతల భరోసా



విజయవాడలో వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న ఉస్మాన్‌బాషా తదితరులు



కె.కొత్తపాలెంలో సరుకులు అందిస్తున్న సర్పంచ్ మాధవి

కె.కొత్తపాలెం(మోపిదేవి): మండలంలోని కె.కొత్తపాలెంలో వరద బాధితులకు ప్రభుత్వ నిత్యావసర సరుకులు గ్రామ సర్పంచ్ కొక్కిలిగడ్డ మాధవి ఆదివారం అందజేశారు. మండల కో ఆప్షన్ సభ్యుడు చందన రంగారావు, రావి రత్నగిరి, గ్రామ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు. ఆదుకున్న స్వచ్ఛంద సంస్థలకు కె.కొత్తపాలెం ఎస్సీ కాలనీ వాసులు శనివారం కృతజ్ఞతలు తెలిపారు.


మర్రిపాలెం(నాగాయలంక): మండలంలోని డేగల పాలెం నెహేమియా మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో అధిక వర్ష ప్రభావిత ప్రాంతమైన మర్రిపాలెం గ్రామంలోని 60 మంది గిరిజన యానాదుల పిల్లలు, కాలనీ వాసులకు ఆదివారం బిరియానీ ప్యాకెట్లు, బ్రెడ్‌లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. విజయవాడకు చెందిన దంపతులు ఏపీ స్టేట్ క్రిస్టియన్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈఓ రత్నమనీష్, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ అసోసియేట్ మేనేజర్ వసుంధర మనీష్ ఆర్థిక సహకారంతో స్వయంగా బాలలకు అందజేశారు. మినిస్ట్రీస్ నిర్వాహకులు పాల్ నెహేమియా, సుకన్యా పాల్ పెద్దలు పాల్గొన్నారు.

రూ.2 లక్షల విలువైన దుస్తుల పంపిణీ

పెడన: విజయవాడ పైపుల రోడ్ సెంటర్ రాజీవ్ నగర్ కాలనీ వారికి రూ.2 లక్షలు విలువైన చీరలు, రెడీమేడ్ దుస్తులను అందించామని సహాయ ఫౌండేషన్ అధ్యక్షుడు ఉస్మాన్‌బాషా ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని పెడనకు చెందిన శ్రీ కృష్ణ రేడీమేడ్స్, పలువురి సాయంతో ఈ దుస్తులను అందించామన్నారు. రౌతుల ప్రసాద్, సుమంత్, సప్పరపు రాజు, పబ్లిక్ పోస్టర్ గని, శాంత రాజు, యాసిన్, తోట మధు, గౌస్, సలీం (లైటింగ్), రౌతుల బాబీ, ప్రేమ్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరు : బెజవాడలో నీట మునిగిన ప్రజలను ఆదుకునేందుకు మండలంలోని లేళ్లగరువు గ్రామస్తులు సహకారం అందించారు. ఆదివారం వెయ్యి మందికి ఆహారం తయారు చేయించి విజయవాడ తీసుకెళ్లారు. వరద ప్రభావం ఉన్న ప్రాంతాల్లోని బాధితులకు పంపిణీ చేసినట్లు వారు వెల్లడించారు.

ఘంటసాల: ఘంటసాల తూర్పు రామాలయం విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం విరాళాలు సేకరించారు. రామాలయంలో ఏర్పాటు చేసిన వినాయక చవితి విగ్రహాన్ని దర్శించుకునేందుకు వచ్చే భక్తులు, స్థానికులను విజయవాడ వరద బాధితులకు సాయం అందించాలని కోరగా రూ.6,150 వచ్చినట్లుతెలిపారు. ఈ నగదును తుమ్మల వెంకటేశ్వరరావుతో కలిసి సీఎం సహాయ నిధికి జమచేసినట్లు చెప్పారు. రావులపల్లి హేమంత్, వేమూరి రుత్విక్, పరుచూరి జగన్ దత్త, పరుచూరి అబయ్, చింటూ, తదితరులు పాల్గొన్నారు.



సాయం అందుకున్న పిల్లలతో నిర్వాహకులు

మళ్లీ పెరుగుతున్న వరద



పెడన మండలం కమలాపురం వద్ద గట్లులకు సమాంతరంగా ప్రవహిస్తున్న బంటుమిల్లి కెనాల్

- పునరావాస కేంద్రాల ఎత్తివేత
- వరద ముంపు ప్రాంతాలకు ఎలర్ట్
- దిక్కుతోచని స్థితిలో బాధితులు

అవనిగడ్డ: పూర్తి స్థాయిలో మురుగుపోలేదు. పారిశుద్ధ్య పనులు ఇంకా పూర్తికాలేదు. ఇళ్లలో నిండిపోయిన బురదను తొలగించలేదు. మరో వైపు వరద ఉధృతి పెరుగుతోంది. అయినా పునరావాస కేంద్రాలను ఖాళీ చేశారు. ఇంకో వైపు ముంపు ప్రాంతాల ప్రజలను అలర్ట్‌గా ఉండమని హెచ్చరిస్తున్నారు. ఇలా విభిన్నంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరు వరద బాధితులను అయోమయానికి గురిచేస్తోంది.

కొన్నిచోట్ల శనివారమే ఖాళీ..

వరదలకు అవనిగడ్డ నియోజకవర్గంలో మొత్తం 14 చోట్ల పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. వరదలకు ఎడ్లంక, పులిగడ్డ శివారు రేగుల్లంక, పల్లెపాలెం , వసుమట్ల, కె. కొత్తపాలెం, బొబ్బర్లంక, దక్షిణ చిరువోలులంక, ఆముదార్లంక గ్రామాలు పూర్తిగా నీటమునిగాయి. ఈ గ్రామాలకు తీరని నష్టం మిగిల్చింది. ఈ ప్రాంతాల్లో ఇంకా పూర్తిగా మురుగు, బురద పోలేదు. పూర్తిగా పారిశుద్ధ్య పనులు చేయలేదు. తాగునీరు, విద్యుత్ సౌకర్యం పూర్తిస్థాయిలో పునరుద్ధరించలేదు. దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టలేదు. గతంలో కంటే వరద ఉధృతి తగ్గడంతో కొంతమందిని శనివారమే పునరావాస కేంద్రాల నుంచి ఖాళీ చేయించారు. మిగిలిన వారిని ఆదివారం మధ్యాహ్నం ఖాళీ చేయించారు.

మళ్లీ పెరుగుతున్న వరద..

ఆదివారం సాయంత్రం ఐదు గంటలకు ప్రకాశం బ్యారేజీ నుంచి 4.28 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. మూడు లక్షల క్యూసెక్కులు దాటితే ఎడ్లంక ప్రాంతానికి రాకపోకలు తెగిపోతాయి. పడవలోనే ప్రయాణం చేయాల్సి ఉంది. రానున్న రోజుల్లో వరద పెరిగే అవకాశం ఉందని ఉన్నతాధికారులు హెచ్చరిస్తున్నారు. అయినా ఎడ్లంక ప్రాంత వాసులను పునరావాస కేంద్రం నుంచి ఖాళీ చేయించడం పట్ల స్థానికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పూర్తిస్థాయిలో పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్ పునరుద్ధరించిన తరువాత పంపితే బాగుండేదని స్థానికులు చెప్పారు. వరద పెరుగుతుందంటున్నారని, మళ్లీ రావాలంటే అన్నీ సర్దుకుని రావడం ఇబ్బందిగా ఉంటుందని ఆయా గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

పెడన: గుడ్లవల్లేరు నుంచి కృత్తివెన్ను లక్ష్మీపురం వరకు ఉన్న బంటుమిల్లి కెనాల్‌లో నీటి ప్రవాహం ఉధృతంగా ప్రవహిస్తోంది. ఒక్కో సమయంలో కాలువ గట్లులకు సమాంతరంగా నీటి ప్రవాహం ఉంటుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తమ పంట పొలాలు ముంపు బారిన పడతాయేమోనని భయపడుతున్నారు. శుక్రవారం ప్రవాహం అధికంగా ఉందని పెడన మండలంలోని కమలాపురం, లంకలకలువగుంట గ్రామాలకు చెందిన ఎనిమిది కుటుంబాలను, బంటుమిల్లి మండలం సాతులూరు గ్రామంలో లోతట్టు ప్రాంతాల్లోని వారిని ఆయా గ్రామాల్లోని పునరావాస కేంద్రాల్లో ఉంచారు. శనివారం ఉదయం ఏమీ జరగకపోవడంతో వినాయక చవితి పండగ చేసుకోవాలని ఆయా కుంటుబాలకు చెందిన వారు ఇళ్లకు వెళ్లిపోయారు. ఆదివారం ఉదయం ఆ ప్రవాహం కాస్తా 485కు, మధ్యాహ్నానికి 510కి చేరడంతో మళ్లీ రైతుల్లో ఆందోళన మొదలైంది. ఆయా గ్రామాల్లో ట్రాక్టర్లు, మట్టి, ఇసుక మూటలను సైతం సిద్ధంగా ఉంచడమే కాకుండా ఆయా కుటుంబాల వారిని మళ్లీ రాత్రికి పునరావాస కేంద్రాలకు చేర్చేలా రెవెన్యూ, ఇతర సిబ్బందికి బాధ్యతలు అప్పగించారు.

బీచ్‌లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పోలీసులు ఎట్టకేలకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. పాలకాయతిప్ప బీచ్ వద్ద ఇటీవల ఇద్దరు పర్యాటకులు మృతి చెందడంతో పోలీసుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. పోలీసుల పర్యవేక్షణ లోపంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని ఆరోపణలు రావడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. బీచ్ వద్ద పోలీసుల హెచ్చరిక పేరుతో బోర్డులు ఏర్పాటు చేశారు. సముద్ర స్థితి గతులు మార్పు రావడం వల్ల ప్రమాదభరితంగా మారిందని, పర్యాటకులు లోతుకు వెళ్లి స్నానాలు చేయరాదంటూ హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. బీచ్ నుంచి సాగర సంగమం వరకు వీటిని పలు ప్రమాదకర ప్రాంతాల్లో ఏర్పాటు చేశారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

మంత్రి రవీంద్ర

చిలకలపూడి(మచిలీపట్నం): నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం ఆదుకుంటుందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. రుద్రవరం, గుండుపాలెం, చిన్నాపురం, నెలకుర్రు, భోగిరెడ్డిపల్లి గ్రామాల్లో ముంపునకు గురైన పంట పొలాలను ఆదివారం పరిశీలించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అధిక వర్షాల వల్ల వ్యవసాయం, ఆక్వా రంగాలకు నష్టం వాటిల్లిందన్నారు. ప్రకాశం బ్యారేజీ నిర్మించాక ఇంతటి వరద ఉధృతి రాలేదన్నారు. కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో నష్టపోయిన పంటలను పరిశీలించారని తెలిపారు. ఈ నెల 10 లోగా నష్టం అంచనాలు రూపొందించాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. 11 నుంచి 16వ తేదీ వరకు గ్రామసభల ద్వారా సోషల్ ఆడిట్ నిర్వహించి, ఈ నెల 18న తుది జాబితా ప్రకటిస్తామన్నారు. ఈ- క్రాప్‌తో సంబంధం లేకుండా ఆదుకోవాలని కృతనిశ్చయంతో ఉన్నామన్నారు. ఆర్డీవో వాణి, తహసీల్దార్ శ్రీనివాస్, ఏవో హారిక పాల్గొన్నారు.



పొలాలను పరిశీలిస్తున్న మంత్రి రవీంద్ర

ఆలయాన్ని సందర్శించిన మంత్రి కొల్లు

మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలో రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం సందర్శించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మంత్రి రవీంద్ర స్వామి వారి ఆశీర్వచనం పొందారు. మంత్రిని మచిలీపట్నం డివిజన్ దేవాలయాల పర్యవేక్షకుడు కగ్గా శ్రీనివాసరావు, ఆలయ కార్యనిర్వహణ అధికారి సుబ్బారెడ్డి తదితరులు సత్కరించారు.